క్లుప్తంగా

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మాకవరపాలెం : అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని జంగాలపల్లి సమీపంలో ఉన్న సర్వానదిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో నుంచి ఇసుక తరలిస్తున్నారు. బుధవారం ఉదయం పోలీసులు నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్లపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ దామోదర్ నాయుడు తెలిపారు.

షిర్డీసాయి మందిరం వార్షికోత్సవాలు



కింతలి వల్లాపురంలో బాబాకు పూజలు చేస్తున్న సాయి భక్తులు

మాడుగుల రూరల్ : మండలంలో కింతలి వల్లాపురం గ్రామంలో గల శ్రీ షిర్డీసాయి బాబా మందిరం ఎనిమిదో వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సాయి ద్వారాకామాయి భజన మండలి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు. సాయంత్రం పల్లకీ ఉరేగింపు నిర్వహించారు.

పరీక్ష మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందిస్తున్న గంగునాయుడు

కె.కోటపాడు : టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో వసతిగృహ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎ.కోడూరు సాంఘిక సంక్షేమశాఖ సమీకృత వసతిగృహాధికారి పి.గంగునాయుడు ఆకాంక్షించారు. స్థానిక వసతిగృహంలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పరీక్ష మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. 36 మంది విద్యార్థులకు అట్ట, జామెంట్రీ బాక్స్, గ్రాఫ్, మ్యాప్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు.

నిర్లక్ష్యం బారిన చేప పిల్లల కేంద్రం

- పట్టించుకోని అధికారులు
- శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకులు



శిథిలావస్థకు చేరిన మత్స్యశాఖ కార్యాలయం



నర్సీపట్నం : జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన నర్సీపట్నం చేపల పెంపక కేంద్రం ప్రభుత్వ నిర్లక్ష్యంతో నేడు శిథిలావస్థకు చేరింది. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు, తాకితే పడిపోయే గోడలు, పురాతన నీటిబావి, కార్యాలయం చుట్టూ పొదలతో అధ్వానంగా మారింది. శిథిల భవనంలోనే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ ట్యాంకులు 14, స్విమ్మింగ్ ట్యాంకులు 9 ఉన్నాయి. ఈ ట్యాంకులు అన్ని శిథిలావస్థకు చేరాయి. మత్స్యశాఖ ఏడీ కార్యాలయం ప్రధాన ద్వారం దెబ్బతింది. పశువులు కార్యాలయం లోపలికి వచ్చేస్తున్నాయి.

గతం ఎంతో ఘనం..

ప్రతి ఏటా చేప పిల్లలను ఉత్పత్తి చేసి నర్సీపట్నం డివిజన్ పరిధిలోని మత్స్యకార సంఘాలకు చేప పిల్లలను పంపిణీ చేస్తే, మినీ రిజర్వాయర్లు, చెరువుల్లో వదిలేవారు. ఏడాదిలో రెండు సార్లు మత్స్యకారులు చేపలు పట్టుకొని జీవనం సాగించేవారు. సుమారు 15 ఏళ్లుగా నీటితొట్టెలు శిథిలావస్థలో ఉన్నాయి. గంభూషియా చేపపిల్లలు ఉత్పత్తి చేసి మే, జూన్ నెలాఖరులో 2 లక్షల వరకు ఉత్పత్తి చేసి, వీటిని మలేరియా అధికారికి అందించేవారు. వారు గ్రామాల్లోని మురుగు కాల్వల్లో వేసి దోమల నివారణకు చర్యలు తీసుకునే వారు. గంభూషియా, సాధారణ చేప పిల్లల పెంపకం అటకెక్కింది.

ఒకప్పుడు ఎంతో ఆదరణ కలిగిన నర్సీపట్నం చేప పిల్లల పెంపక కేంద్రం నిరాదరణకు గురైంది. శిథిలావస్థకు చేరిన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. చుట్టూ పొదలు పెరిగిపోవడంతో విష సర్పాలు సైతం కార్యాలయంలోకి ప్రవేశించడంతో సిబ్బంది హడలిపోతున్నారు. కార్యాలయానికి రక్షణ లేకపోవడంతో సాయంత్రం వేళల్లో ఆకతాయిలు కార్యాలయంలోకి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం..

చేపపిల్లల పెంపకం కేంద్రంలో నీటి ట్యాంకులను పునరుద్ధరించేందుకు, నూతన భవనం, కొత్త బోర్‌వెల్, కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.50 లక్షల అంచనాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. నిధులు మంజూరైతే పూర్తి స్థాయిలో చేపల పెంపకం చేపడతాం.

–ప్రసాదరావు, మత్స్యశాఖ ఏడీ, నర్సీపట్నం

ధాన్యం మొత్తం బుగ్గయింది...

- వడ్డాదిలో అగ్ని ప్రమాదం
- రెండు పశువుల పాకలు, వరి కుప్పలు దగ్ధం



ప్రమాదంలో కాలిపోతున్న వరి కుప్పలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల వడ్డాదిలో బుధవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో నలుగురు రైతులకు చెందిన రెండు పశువుల పాకలు, రెండు వరి కుప్పలు, 30 బస్తాల ధాన్యం, ఒక ఎడ్ల బండి, రెండు గడ్డి మేట్లు కాలిపోగా రూ.5 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. నలుగురు రైతులకు చెందిన పాకలు, గడ్డి మేట్లు, ధాన్యం కుప్పలు దూరంగా ఉండగా ఒకేసారి అన్నీ అగ్నికి ఆహుతవ్వడంతో అగ్ని ప్రమాదంపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా కావాలని నిప్పుపెట్టి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కుబిరెడ్డి ప్రకాష్‌కు చెందిన పశువుల పాక, ధాన్యం కుప్ప, గడ్డిలో దాచుకున్న 30 ధాన్యం బస్తాలు కాలిపోగా, దొరబాబుకు చెందిన టైర్ బండి, గడ్డి మేటు కాలిపోయి, ఎద్దుకు కూడా గాయాలయ్యాయి. లింగంపల్లి శోభన్‌బాబుకు చెందిన పశువుల పాక, వరి కుప్ప, ఈశ్వరరావుకు చెందిన గడ్డి మేటు కాలిపోయాయి. చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వడ్డాది వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు జరగనున్నాయి. ఇంట్లో ధాన్యం బస్తాలు వేస్తే ఉత్సవాలకు వచ్చిన చుట్టాలు, బంధువులకు వసతి సౌకర్యం ఉండదని ఉత్సవాలు ముగిసిన తరవాత ధాన్యం కుప్ప నూర్చి గతంలో ఉండిపోయిన 30 బస్తాల ధాన్యం కలిపి అమ్మి అప్పులు తీర్చుదామనుకున్నానని, ఇంతలోనే ధాన్యం కాలిపోయి తిండి గింజలు మిగలని పరిస్థితి ఏర్పడిందని బాధితుడు ప్రకాష్ భోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. అగ్ని ప్రమాదంపై కుబిరెడ్డి ప్రకాష్ బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఐటీఐకు మెకానిక్ టూల్ కిట్ వితరణ



ఫౌండేషన్ ప్రతినిధులతో ప్రిన్సిపాల్ శ్రీనివాసాచార్యులు, విద్యార్థులు

నర్సీపట్నం : మహేంద్ర, మహేంద్ర టెక్ కార్నర్, సెంటుమ్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో నర్సీపట్నం ప్రభుత్వ ఐటీఐ డీజిల్ మెకానిక్ ట్రేడ్‌కు సీఎస్‌ఆర్ నిధులు నుంచి టూల్ కిట్, ఎల్ఈడీ టీవీ, కట్ మోడల్ ఇంజిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.నవీన్, ఎం.నరసింహ, జె.బాలమురళి విద్యార్థులకు క్లాస్ రూమ్ ట్రైనింగ్ ఇచ్చారు. ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి మాట్లాడుతూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సామాగ్రితో పాటు శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయన్నారు.

30 తేదీ వరకు గాలికుంటు టీకాల కార్యక్రమం



తారువలో పశువులకు టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీడీ చంద్రశేఖర్

కె.కోటపాడు : మూడు నెలల వయస్సు దాటిన ప్రతి ఆవు, గేదెలకు గాలికుంటు టీకాలు వేయించాలని విశాఖ ఉమ్మడి జిల్లా పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరక్టర్ చంద్రశేఖర్ పశువైద్య సిబ్బందికి సూచించారు. మండలంలో పిండ్రంగి గ్రామంలో బుధవారం గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ నెల 1 తేదీ నుంచి ప్రారంభమైన టీకాలు వేసే కార్యక్రమాన్ని 30 వరకూ జరపాలన్నారు. 4 నుంచి 8 నెలల వయస్సు గల ఆడపెయ్యిలకు బ్రూసిల్లోస్ టీకాలను వేయాలన్నారు. పిండ్రంగి గ్రామంలో 110 పశువులకు గాలికుంటు టీకాలను బుధవారం వేసినట్టు కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. కార్యక్రమంలో కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్, పశువైద్య సహాయకుడు సంతోష్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : నాలుగు నెలల వయసు దాటిన ప్రతి పశువుకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని విశాఖపట్నం జిల్లా పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని తారువలో టీకా కార్యక్రమాన్ని బుధవారం ఏడీ దినేష్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని, నివారణకు టీకా ఒక్కటే మార్గమన్నారు. మామిడిపల్లి, ఎం.అలమండ పశువైద్యశాలలను తనిఖీ చేశారు. ఎం.అలమండ, మామిడిపల్లి పశువైద్యాధికార్లు కె.మంజుషరాణి, జి.ప్రియాంక పాల్గొన్నారు.

వ్యవసాయం, ఉపాధికి ప్రాధాన్యమేదీ...



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

నర్సీపట్నం : ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యాలయ డీటీ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలుగుల అర్జునరావు, మాకిరెడ్డి రాము నాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో రైతులకు, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, వ్యవసాయ కార్మికులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు, రూ.700 కూలి కల్పించాలన్నారు. యంత్రాలకు బదులు కూలీలతో పనులు చేయించాలని, వలసలు నివారించాలని అన్నారు. వేసవిలో ఉపాధి పనుల వద్ద టెంట్లు, నీళ్లు, మజ్జిగ, మెడికల్ కిట్లు సదుపాయం కల్పించాలని, 50 ఏళ్లు నిండిన వృద్ధులైన వ్యవసాయ కార్మికులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా సంఘం గౌరవ అధ్యక్షుడు కొండలరావు, శ్రీరామ్మూర్తి, భాస్కరరావు, రైతుల సంఘం నాయకులు మర్రి బాబులు, మేకా సత్యనారాయణ, రాంబాబు, ఎల్వీ రమణ, శెట్టి పైడియ్య, సత్తిబాబు పాల్గొన్నారు.

9న ఒమ్మలి కాటా మోదకొండమ్మ పాదాలు తీర్థం

మాడుగుల : ఈ నెల 9వ తేదీన మండలంలో ఒమ్మలి చెరకు తూనిక కేంద్రం వద్ద వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం అంగరంగ వైభవంగా జరగనుందని ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. అమ్మవారి పాదాలను పూలు, నగలతో అలంకరించారు. తెల్లవారు నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు జరగనున్నాయన్నారు. సాయంత్రం శక్తి వేషాలు, బేతాళ వేషాలతో పాటు జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు జరగనున్నాయని తెలిపారు. తీర్థం రోజు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ దినోత్సవం



అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త చంద్ర

మాడుగుల రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ దినోత్సవం బుధవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు నెల రోజుల పాటు ఏమి నేర్చుకుంటున్నారో తల్లులకు తెలియపరిచేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కె.జె.పురం 1 వ అంగన్‌వాడీ కేంద్రంలో భాషాభివృద్ధి, గ్రహణశక్తి మేధోవికాసం, సాంఘికాభివృద్ధి గురించి కేంద్రాల్లో చిన్నారులకు నేర్పుతున్నట్టు అంగన్‌వాడీ కార్యకర్త పి.చంద్ర వివరించారు. కార్యక్రమంలో ఆయా నూకరత్నం, చిన్నారుల తల్లులు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించండి



భీమవరంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

బుచ్చెయ్యపేట : గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చోడవరం ఎక్సైజ్‌శాఖ సీఐ పాపునాయుడు తెలిపారు. బుధవారం చిన భీమవరం, గున్నెంపూడి, గౌరెలపాలెం గ్రామాల్లో నవోదయం 2.0 లో భాగంగా ప్రజలకు సారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. నాటు సారా తయారు చేయడం వల్ల తాగడం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించారు. యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారంలాంటి జీవితాన్ని పాడు చేసుకోవద్దన్నారు. నాటు సారా తాగడంపై కలిగే అనర్థాల గురించి విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, గ్రామస్తులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమ్మునాయుడు, ఎస్‌ఐ ఎం.శేఖరం, సీసీ అప్పలనాయుడు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల రాణింపు

నర్సీపట్నం : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికలను ఉద్దేశించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, పౌష్టికాహారం, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష గురించి వివరించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ ఉన్నత చదువులపై దృష్టి సారించాలన్నారు. విద్య ద్వారా ఎంతో మంది మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఉత్తమ మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

యోగాతో పరీక్షల్లో ఒత్తిడి దూరం

దేవరాపల్లి: పదో తరగతి పరీక్షల్లో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, ధ్యానం సాధన చేయాలని ఐసీడీఎస్ వేచలం సెక్టార్ సూపర్‌వైజర్ జి. ఆదిలక్ష్మి సూచించారు. వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులు పదో తరగతి అనంతరం ఉన్నత చదువులపై దృష్టి సారించాలని సూచించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

నర్సీపట్నం : హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం ఎంఈవో కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ నాయకుడు వెంకట్రావు మాట్లాడుతూ మినిమమ్ టైం స్కేల్, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ, కారుణ్య నియామకాలు, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలో మహిళా ఉద్యోగుల సమస్యలపై సదస్సు నిర్వహించాలని, ఈ నెల 11న విజయవాడ కేంద్రంలో నిరసన దీక్ష చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు.

పారదర్శకంగా పీ–4 సర్వే

దేవరాపల్లి : పీ–4 సర్వేను పారదర్శకంగా చేపట్టాలని దేవరాపల్లి ఎంపీడీవో సువర్ణరాజు సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశమయ్యారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుకు 27 ప్రశ్నలతో కూడిన ఈ సర్వేను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రావికమతం : రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం ప్రారంభించనున్న పీఫోర్ సర్వేను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకన్న బాబు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశమై అన్ని సచివాలయ పరిధిలో అట్టడుగున ఉన్న 20 కుటుంబాలను ఈ నెల 8 తేదీ నుంచి 18 లోగా గుర్తించాలని తెలిపారు.

మూడు గ్రామాలకు జేజేఎం నిధులు

మాడుగుల రూరల్ : గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి మూడు గ్రామాలకు జల్‌జీవన్ మిషన్ నిధులు మంజూరైనట్టు ఏమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జె.డి.పేట గ్రామానికి రూ.58 లక్షలు, పోతనపూడి గ్రామానికి రూ.28 లక్షలు, సాగరం గ్రామానికి రూ.30 లక్షలు నిధులు మంజూరయ్యాయని, త్వరలో ఈ నిధులతో పనులు ప్రారంభం కానున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

అదనపు లోడ్ చార్జీలపై రాయితీ

మాకవరపాలెం : విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్ చార్జీలను 50 శాతం రాయితీపై చెల్లించుకోవచ్చని విద్యుత్‌శాఖ ఏఈ బాలకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ అధిక లోడ్ తీసుకునే గృహోపకరణాలు వాడే వారంతా అదనపు లోడ్ కోసం చార్జీలు చెల్లించాలన్నారు. అయితే వినియోగదారులకు విద్యుత్ శాఖ రాయితీ ఇస్తోందన్నారు. 1 కిలోవాట్‌కు రూ.2250 కాగా రాయితీపై రూ.1250 చెల్లిస్తే సరిపోతుందన్నారు. అలాగే 5 కిలోవాట్ వరకు రాయితీపై అదనపు లోడ్ చార్జీలు చెల్లించుకోవచ్చన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచ్

రోలుగుంట : కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు తన సొంత నిధులతో పరీక్ష సామాగ్రిని సమకూర్చారు. వాటిని బుధవారం 32 మంది విద్యార్థులకు ఆయన హెచ్‌ఎం శెట్టి మోహన్‌రావుతో కలసి పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పదో తరగతిలో అధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

స్కౌట్ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

కె.కోటపాడు : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణను అలవర్చుకోవాలని భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ అనకాపల్లి జిల్లా కోఆర్డినేటర్ కె.రత్నకుమారి అన్నారు. కె.కోటపాడు వేణు విద్యానికేతన్‌లో స్కౌట్ అండ్ గైడ్స్‌గా ఆరు నెలల శిక్షణ కాలం పూర్తి చేసుకున్న 60 మంది విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు సామాజిక స్పృహ, దేశభక్తి, వ్యక్తిత్వ నిర్మాణం, విజ్ఞానం పెంపొందించుకునేలా శిక్షణ ఇస్తామని తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అందించే సర్టిఫికెట్ ఉన్నత చదువుల్లోను, ఉద్యోగ అవకాశాల్లోను అదనపు అర్హతగా ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యానికేతన్ ప్రిన్సిపాల్ వేణు, వై.సోని, ప్రశాంత్, ప్రసన్న పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

గొలుగొండ : ఆస్పత్రిలో వైద్య అధికారులు రోగుల పట్ల బాధ్యతగా పనిచేయాలని అడిషనల్ డీఎంహెచ్‌వో ప్రశాంతి అన్నారు. ఆమె గొలుగొండ పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. బీపీ, సుగర్ పరీక్షలు ఎప్పటికప్పుడు రోగులకు నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్యామ్ కుమార్, సీహెచ్‌వో ప్రసాద్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో చోరీ



చోరీ జరిగిన ఆలయం



చెరువులో పడేసిన హుండీ

దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి గోవిందమాంబ సహిత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం ప్రధాన ద్వారంతో పాటు గర్భాలయం తాళాలను పగుల కొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. ఇటీవల జరిగిన కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారికి అలంకరించిన సుమారు తులం బంగారు శతమానాలు, పది తులాల మేర వెండి సామాగ్రి చోరీకి గురయ్యాయని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. అలాగే దొంగలు హుండీ తాళాలు సైతం పగులకొట్టి రూ.35వేలు నగదు అపహరించి, హుండీని చెరువులో పడేశారన్నారు. దీనిపై దేవరాపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తగరంపూడి నాగేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, జి.ధనాజీ తెలిపారు. గతంలోనూ ఈ ఆలయంలో రెండుమార్లు దొంగతనం జరిగిందని తెలిపారు.

83 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

దేవరాపల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 83 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 45 మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ వివేక్ వర్మ కంటి వైద్య పరీక్షలు జరిపారు. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్య మేఘన, డా.వనజ, భవానీ, క్యాంప్ ఆర్డినేటర్ అశ్విన్‌కుమార్ పాల్గొన్నారు.